# USEFUL PAPER CLIPPINGS

Scanned with OKEN Scanner

# DEPARTMENT OF COMMERCE

## PAPER CLIPS

Scanned with OKEN Scanner

# DEPARTMENT OF COMMERCE


## PAPER CLIPS

Scanned with OKEN Scanner

బలమైన ఆర్థిక వ్యవస్థకు పటిష్టమైన మౌలిక సదుపాయాలు చాలా అవసరం. ఈ సదుపాయాలపైనే ఎన్నో పరిశ్రమల ఏర్పాటు ఆధారపడి ఉంటుంది. అందుకనే కేంద్ర సర్కారు మౌలిక సదుపాయాల అభివృద్ధి. విస్తరణకు సంబంధించి భారీ ప్రణాళికలతో ఉంది. ఇందులో భాగంగా ఇటీవలే నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్‌ఎంపీ)ను ప్రకటించింది. ఇందులో భాగంగా రహదారులు. రైల్వే. విద్యుత్ తదితర రంగాల్లోని ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు నిర్వహణకు అప్పగించనుంది. తద్వారా 2024-25 నాటికి రూ.6 లక్షల కోట్లు సమకూరుతాయని అంచనా. ఈ మొత్తాన్ని మౌలిక సదుపాయాల విస్తరణకే కేంద్రం ఖర్చు చేయనుంది. బ్యాంకింగ్ వ్యవస్థలో ఎన్‌పీఏల కారణంగా మౌలిక సుదుపాయాల ప్రాజెక్టులకు కొంత కాలం పాటు రుణ లభ్యత కఠినంగా మారిందని చెప్పకోవచ్చు. కానీ, కరోనా మహమ్మారి తర్వాత పరిస్థితుల్లోనూ మార్పు కనిపిస్తోంది. మౌలిక సదుపాయాలపై కేంద్రం, రాష్ట్రాలు ప్రత్యేక దృష్టి సారిస్తున్న తరుణంలో ఈ రంగంలోని పెట్టుబడులపై ఇన్వెస్టర్లు ఓ సారి దృష్టి సారించొచ్చు.

# బూమ్ బూమ్.. ఇన్‌ఫ్రా..!

2005-08 మధ్యకాలంలో ఇన్‌ఫ్రా స్టాక్స్‌లో పెద్ద బూమ్ కనిపించింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత తిరిగి మౌలిక సదుపాయాల కంపెనీల స్టాక్స్ పెద్దగా ర్యాలీ చేసింది లేదు. తలకుమించిన రుణ భారంతో కొన్ని కనుమరుగు అయిపోగా.. నాణ్యమైన కంపెనీలు గట్టిగా నిలబడ్డాయి. వీటికితోడు ఇన్విట్ రూపంలో కొత్త అవకాశాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. వీటికి అదనంగా ఇన్‌ఫ్రా కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసే మ్యూచువల్ ఫండ్స్ పథకాలు కూడా ఉన్నాయి. వీటిల్లో ఇన్వెస్టర్లు తమ రిస్క్, కాల వ్యవధి, రాబడుల ఆకాంక్షల ఆధారంగా అనుకూలమైన సాధనాన్ని ఎంపిక చేసుకుని పెట్టుబడులు పెట్టుకోవచ్చు.



- మౌలిక రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు
- సదుపాయాల విస్తరణకు కేంద్రం భారీ ప్రణాళికలు
- నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ రూపంలో నిధులు
- ఆర్థిక వృద్ధితో లాభపడే రంగాల్లో ఇన్‌ఫ్రా కూడా ఒకటి
- పెట్టుబడులకు అందుబాటులో పలు సాధనాలు



## ఇన్విట్‌లు

పెట్టుబడిపై క్రమం తప్పకుండా ఆదాయం కోరుకునే వారు, కొంత రిస్క్ తీసుకోవడానికి సుముఖంగా ఉంటే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)లను ఎంపిక చేసుకోవచ్చు. ఇన్‌ఫ్రా కంపెనీలు ఏర్పాటు చేసే ప్రత్యేక పెట్టుబడుల వాహకాలే ఇన్విట్‌లు. కంపెనీలు తమ నిర్వహణలోని కొన్ని ప్రాజెక్టులను ఇన్విట్ కిందకు బదిలీ చేయడం ద్వారా నిధులను సమీకరించుకోవచ్చు. అలా సమకూరిన నిధులను అవి నూతన ప్రాజెక్టుల నిర్వహణ, రుణ భారం తగ్గించుకునేందుకు వినియోగించుకునే వెసులుబాటు లభిస్తుంది. సెబీ నిబంధనల ప్రకారం ఇన్విట్‌లు 80% నిధులను ఆదాయాన్నిచ్చే ప్రాజెక్టుల్లోనే ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. అలాగే, ప్రాజెక్టుల నుంచి వచ్చే ఆదాయాన్ని వాటాదారులకు పంపిణీ చేయాలి. ఒక్కో యూనిట్ వారీ నికర మిగులు పంపిణీ ఆదాయం (ఎన్‌డీఎస్) నుంచి 90 శాతం వాటాదారులకు ప్రతీ త్రైమాసికానికి ఒక పర్యాయం పంపిణీ చేయాలి. అలా అని ప్రతీ క్వార్టర్‌కు కచ్చితంగా ఇంత చొప్పున వస్తుందని ముందే అంచనా వద్దు. స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ అయిన ఇన్విట్‌లలో షేర్ల మాదిరే క్రయ, విక్రయాలు చేసుకునేందుకు వెసులుబాటు ఉంది. కంపెనీల వాటాలు షేర్ల రూపంలో ఉంటే.. ఇన్విట్‌లకు సంబంధించి యూనిట్లు ట్రేడవుతుంటాయి. కనుక షేర్ల మాదిరే, మూలధన లాభాలు, నష్టాలకు అవకాశం ఉంటుంది. డెట్, ఈక్విటీల కలయికగా (హైబ్రిడ్) దీన్ని చూడొచ్చు. ఇన్విట్ ఐపీవోల్లో కనీస పెట్టుబడి రూ.10,000–15,000. లిస్టింగ్ తర్వాత ఇంతకుముందు కనీసం 100 యూనిట్లను కొనుగోలు చేయడం, విక్రయించడమే సాధ్యమయ్యేది. ఇప్పుడు షేర్ మాదిరే ఒక్కో యూనిట్ చొప్పున కొనుగోలు చేసుకోవచ్చు.

## లిస్టింగ్‌లో ఇవీ...

పవర్‌గ్రిడ్ ఇన్విట్, ఇండియా గ్రిడ్ ట్రస్ట్, ఐఆర్‌బీ ఇన్విట్ ఫండ్ లిస్ట్ అయి ఉన్నాయి. ఇందులో పవర్ గ్రిడ్ ఇన్విట్ అన్నది పవర్‌గ్రిడ్ కార్పొరేషన్‌కు సంబం ధించినది. ఇండియాగ్రిడ్ ట్రస్ట్‌ను కేకేఆర్, స్టెరిలైట్ పవర్ ట్రాన్స్‌మిషన్ స్పాన్సర్ చేస్తున్నాయి. . ఇండియాగ్రిడ్ ప్రతీ త్రైమాసికానికి ఒక్కో యూనిట్‌పై రూ.3ను పంపిణీ చేస్తోంది. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా నిర్వహణలోని ఇన్విట్ ఫండ్ పరిధిలో టోల్ ఆధారిత రహదారి ప్రాజెక్టులున్నాయి. రోడ్లపై వాహనాల రద్దీ ఆధారంగా ఐఆర్‌బీ ఇన్విట్ ఆదాయంలోనూ అస్థిరతలు ఉంటుంటాయి. ప్రతీ యూనిట్‌కు 2018–19లో ఎన్‌డీఎస్ 12.25గా ఉండగా, ఆ తర్వాతి రెండేళ్లలో రూ.10, రూ.8.5కు తగ్గడం గమనార్హం. కరోనా లాక్‌డౌన్‌ల ప్రభావం ఈ సంస్థ ఆదాయంపై పడింది. ఇండియా గ్రిడ్ ఆరంభం నుంచి ఏటా పవర్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులను అదనంగా చేర్చుకుంటూ వస్తోంది. దీంతో 2017–18లో రూ.448 కోట్ల ఆదాయం కాస్తా.. 2020–21 నాటికి రూ.1,675 కోట్లకు విస్తరించింది. భవిష్యత్తులో మరిన్ని ఇన్విట్‌లు కూడా ఐపీవోకు రానున్నాయి.

## ఇన్‌ఫ్రా స్టాక్స్

**దీర్ఘకాలం కోసం నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టుకోవాలన్న ఆలోచనతో ఉంటే.. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టాక్స్‌ను ఎంపిక చేసుకోవచ్చు.**

**ఎల్అండ్‌టీ:** 2007 నవంబర్‌లో ఎల్అండ్‌టీ షేరు ధర రూ.972. గతేడాది మార్చిలో ఇదే షేరు రూ.815వరకు తగ్గగా.. ప్రస్తుతం రూ.1,740 సమీపంలో ఉంది. కొన్ని రంగాల్లోని షేర్లు ఇదే కాలంలో ఎన్నో రెట్లు పెరిగిపోయాయి. కానీ, మౌలిక రంగ షేర్లు ఇప్పటికీ ఆకర్షణీయమైన వ్యాల్యూయేషన్లలో ట్రేడ్ అవుతున్నాయి. నిర్మాణ, ఇంజనీరింగ్ రంగంలో ఎల్అండ్‌టీ దిగ్గజం అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అంతేకాదు, ఈ కంపెనీకి చెందిన సబ్సిడరీలు (మైండ్‌ట్రీ, ఎల్అండ్‌టీ ఇన్ఫోటెక్, ఎల్అండ్‌టీ టెక్నాలజీస్) ఐటీ రంగంలో మెరుగ్గా రాణిస్తున్నాయి. ఇది కూడా అదనపు బలం. 2020–21 సంవత్సరం ఆదాయంలో మౌలిక రంగ వ్యాపార వాటా 45 శాతంగా ఉంది. రూ.3.2 లక్షల కోట్ల ఆర్డర్‌బుక్‌తో కంపెనీ పటిష్టంగా కనిపిస్తోంది.


**పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్:** ప్రభుత్వ ప్రణాళికలతో ఎక్కువగా ప్రయోజనం పొందే కంపెనీల్లో ఇది కూడా ఒకటి. వచ్చే రెండేళ్లలో రూ.15 లక్షల కోట్ల మేర రహదారుల విస్తరణను కేంద్రం చేపట్టనుంది. ఈ సంస్థకు రుణ భారం తక్కువగా ఉంది. 20 ఏళ్ల మంచి ట్రాక్ రికార్డు కూడా సొంతం. ఈక్విటీతో పోలిస్తే 1.37 రెట్ల రుణ భారం కలిగి ఉంది. ఆదాయం, నికర లాభాల్లో మంచి వృద్ధిని చూపిస్తోంది. రూ.12,095 కోట్ల విలువైన ఆర్డర్లు కంపెనీ చేతిలో ఉన్నాయి. ఆదాయంలో 20 శాతం వృద్ధి నమోదు చేస్తామన్న అంచనాలను కంపెనీ ప్రకటించింది. ఎల్అండ్‌టీ మాదిరి వైవిధ్య వ్యాపారాలతో కూడిన కంపెనీ ఇది కాదు.

**కల్పతరు పవర్‌ట్రాన్స్‌మిషన్:** విద్యుత్ సరఫరా, ఆయిల్ అండ్ గ్యాస్ పైపులైన్లు, రైల్వే, రహదారుల నిర్మాణంలోని కంపెనీ ఇది. ఆదాయాల్లోనూ మంచి వైవిధ్యం ఉంది. 2020–21 ఆదాయంలో 37 శాతం అంతర్జాతీయ కార్యకలాపాల నుంచి వచ్చింది. అప్రధాన ఆస్తులను విక్రయించడం ద్వారా రుణ భారాన్ని తగ్గించుకునే ప్రణాళికతో ఉంది. 2021 మార్చి నాటికి ఈక్విటీతో పోలిస్తే రుణభారం 0.66 రెట్లుగా ఉంది. కంపెనీ చేతిలో రూ.29,313 కోట్ల ఆర్డర్లు ఉండడంతో భవిష్యత్తు వ్యాపార వృద్ధికి చక్కని అవకాశాలు కనిపిస్తున్నాయి.

## లాభాలపై పన్ను..

ఇన్విట్‌లను కొనుగోలు చేసి, తర్వాత విక్రయించినప్పుడు వచ్చే లాభం, నష్టాలు ఆదాయ పన్ను పరిధిలోకి వస్తాయి. ఇన్విట్‌ల నుంచి అందుకునే ఆదాయం వాటాదారుల వ్యక్తిగత ఆదాయానికి కలుస్తుంది. కనుక ఎవరికి వారే తమ ఆదాయ పన్ను శ్లాబు ఆధారంగా ఈ మొత్తంపైనా పన్ను చెల్లించాల్సి వస్తుంది. నూతన కన్సెషనల్ పన్ను విధానాన్ని ఇన్విట్ నిర్వహణలోని ప్రాజెక్టులు ఎంపిక చేసుకుంటేనే ఇది వర్తిస్తుంది. ఇన్విట్‌లను మూడేళ్ల తర్వాత విక్రయిస్తే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను పరిధిలోకి లాభం వస్తుంది. అప్పుడు రూ.లక్షకు మించిన లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి. మూడేళ్లలోపు లాభాలు స్వల్పకాలిక మూలధన లాభాల పన్ను కిందకు వస్తాయి. వీటిపై 15 శాతం పన్ను ఉంటుంది. ఆయా అంశాలన్నింటిపై సమగ్ర అవగాహన కోసం నిపుణులను సంప్రదిస్తే మంచిది.

# బుజ్జాయి భవితకు భరోసా!



**అమ్మాయి అంటే అదృష్టం అని నమ్మే సంస్కృతి మనది... చిరు నవ్వుల చిన్నారి ఇంట్లో తిరుగుతూ ఉంటే తల్లిదండ్రుల గుండెల్లో చెప్పలేని సంతోషం... ఆమె చదువు... వివాహం... ఇలా ఆమె భవిత గురించి ఆలోచనలు ప్రారంభం అవుతాయి. నమ్మకమైన పెట్టుబడి పథకాలను ఎంచుకొని, క్రమానుగతంగా పొదుపును ప్రారంభిస్తారు. ఇలా తమ కలల పంట భవిష్యత్తుకు ఒక భరోసా ఇవ్వాలని భావించే వారికోసం మరో కొత్త పథకం అందుబాటులోకి వచ్చింది. అదే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్యా సమృద్ధి యోజన. ఈ ఖాతా విశేషాలు ఏమిటో చూద్దామా!**

కారణాలు ఏమైతేనేమి... గతంలో ఆడపిల్లలంటే చిన్నచూపు ఉండేది. 2001లో ఆరేళ్ల లోపు పిల్లల్లో వేయి మంది బాలురకు బాలికలు 921 మందే. 2011 జనాభా లెక్కల ప్రకారం 1000 మంది బాలురకు 918 మంది బాలికలే ఉన్నారు. ఆడపిల్ల ఆర్థిక భారం అని కొందరు భావించడం వల్లనే ఈ దుస్థితి. కానీ, మారుతున్న కాల పరిస్థితుల్లో ఈ ఆలోచనలు మారిపోయాయి. ఇప్పుడు ప్రభుత్వ పరంగానూ అమ్మాయిలకు ఎన్నో ప్రోత్సాహకాలు అందుతున్నాయి. ఈ లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం ఆడపిల్లను రక్షించు - ఆడపిల్లను చదివించు (బేటీ బచావో - బేటీ పడావో) కార్యక్రమాన్ని ప్రచారంలోకి తెచ్చింది. ఇందులో భాగంగానే ప్రత్యేకంగా బాలికల కోసం సుకన్యా సమృద్ధి యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది.

- పదేళ్ల వయసు మించని కూతురు పేరుతో తల్లిదండ్రులు ఈ పొదుపు ఖాతాను ప్రారంభించవచ్చు. 2015 డిసెంబరు 2 వరకూ 11 సంవత్సరాల వయసు ఉన్న (2003 డిసెంబరు 1వ తేదీ తర్వాత పుట్టిన) కూతురి పేరుతో కూడా ఈ ఖాతా తెరవవచ్చు. ఆ తేదీ తర్వాత మాత్రం 10 ఏళ్ల వయసు మించని ఆడపిల్ల పేరుతో మాత్రమే ఖాతా తీసుకునేందుకు అనుమతిస్తారు. ఒక కూతురి పేరుతో ఒక ఖాతా మాత్రమే ఉండాలి. తల్లిదండ్రులు తమ ఇద్దరు కూతుళ్లకు మించి ఈ ఖాతా తెరవకూడదు. అయితే, కవల ఆడపిల్లలు పుట్టినప్పుడు మాత్రం ఆ ఇద్దరు కవల పిల్లలతోపాటు, మరో కూతురు ఉంటే ఆమె పేరుతో కూడా ఖాతా తెరవవచ్చు. ఖాతా తెరవడానికి ఆడపిల్ల పుట్టిన తేదీ ధ్రువీకరణతోపాటు, తల్లి లేదా తండ్రి ధ్రువీకరణ, చిరునామా ధ్రువీకరణ పత్రాలు కూడా సమర్పించాలి.
- ఖాతా తెరవడానికి కనీసం వేయి రూపాయలు జమ చేయాలి. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1,000 నుంచి రూ.1,50,000 వరకూ ఎంతైనా జమ చేయవచ్చు. ఒక ఏడాది రూ.1,50,000 జమ చేసి, మరో ఏడాది రూ.1,000 జమ చేసినా సరిపోతుంది. ఏడాది మొత్తంలో కనీస మొత్తం కూడా పొదుపు చేయకపోతే రూ.50 జరిమానాతో బకాయిపడ్డ కనీస మొత్తాన్ని తర్వాత సంవత్సరం కట్టవచ్చు. ఇలా ఖాతా ప్రారంభించిన 14 ఏళ్ల వరకూ చెల్లించాలి.
- పోస్టాఫీసు, పబ్లిక్ రంగ బ్యాంకులలో ఈ ఖాతా ప్రారంభించవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, ప్రస్తుతం ఈ పథకం పోస్టాఫీసులలో మాత్రమే లభిస్తోంది. కొద్ది రోజుల్లో బ్యాంకుల్లో కూడా ఈ ఖాతా ప్రారంభించే అవకాశం ఉంది.
- ఈ ఖాతాలో జమ చేసిన మొత్తానికి 9.1శాతం వార్షిక చక్రవడ్డీ లభిస్తుంది. ఈ వడ్డీ శాతాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్చేందుకు వీలుంది. ప్రజా భవిష్య నిధిలాగానే ప్రతి ఏటా వర్తించే వడ్డీ రేటును ప్రభుత్వం ప్రకటిస్తుంది. నెలలో పదో తారీఖుకల్లా కట్టిన మొత్తానికి మాత్రమే ఆ నెలలో వడ్డీ లభిస్తుందని పోస్టాఫీసు నిబంధనలు చెబుతున్నాయి.
- డబ్బును నేరుగా నగదు, చెక్కు, డిమాండు డ్రాఫ్టు రూపంలో జమ చేయవచ్చు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు అనుమతించడం లేదు. ఖాతాదారుకు ఇచ్చే పాస్‌పుస్తకంలో అమ్మాయి పుట్టిన తేదీతోపాటు జమ చేసిన మొత్తం, వడ్డీ తదితర వివరాలన్నీ రాస్తారు.
- కూతురికి పదేళ్లు వచ్చే వరకూ తల్లిదండ్రులు ఖాతాను నిర్వహించవచ్చు. పదేళ్లు వచ్చిన తర్వాత ఆ ఖాతా నిర్వహణ అమ్మాయే చూసుకోవచ్చు. అయితే, ఖాతాలో తల్లిదండ్రులు డబ్బును జమ చేయవచ్చు.
- ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80సీ నిబంధన ప్రకారం పీపీఎఫ్, బీమా పాలసీలు, ఇంటి రుణానికి కట్టే అసలు మొత్తం తదితర పొదుపు పథకాలన్నింటితోపాటు సుకన్యా సమృద్ధి ఖాతాలో ఏడాదికి గరిష్ఠంగా చెల్లించే రూ.1,50,000 వరకూ ఆదాయపు పన్ను రాయితీ లభిస్తుంది.
- ఈ పథకంలో జమ చేసిన మొత్తానికి, వచ్చే వడ్డీకి, ఖాతా కాల పరిమితి ముగిశాక అందుకునే మొత్తానికీ పన్ను మినహాయింపు వర్తిస్తుంది.
- ఖాతా ప్రారంభించిన తేదీ నుంచి 14 ఏళ్ల వరకూ డబ్బు జమ చేయాలి. ఖాతా ప్రారంభ తేదీ నుంచి 21 ఏళ్ల వరకూ ఖాతాను కొనసాగించాలి. అమ్మాయి వయసు 18 నిండిన తర్వాత పెళ్లయితే ఖాతా ప్రారంభించి 21 ఏళ్లు పూర్తికాకున్నా వడ్డీతో సహా తీసుకోవచ్చు. 18 ఏళ్లు నిండిన తర్వాత అమ్మాయి విద్య లేదా పెళ్లి కోసం గత ఏడాది చివరిలో ఉన్న నిల్వపై సగం వరకూ డబ్బు తీసుకోవచ్చు. వ్యవధి పూర్తయ్యాక కూడా డబ్బు వెనక్కి తీసుకోకపోతే ఖాతాలో వడ్డీ జమ అవుతూనే ఉంటుంది.
- ఖాతా కాల పరిమితి ముగిసేలోగా ఖాతాదారుడికి ఏదైనా జరిగితే బాలిక సంరక్షకునికి ఖాతాలోని సొమ్మును వడ్డీతో సహా చెల్లిస్తారు.
- కాలపరిమితి ముగిసేలోగా ఖాతాను రద్దు చేసుకునే వీల్లేదు. ప్రాణ నష్టం, తీవ్ర అనారోగ్యం వంటి అనూహ్య కారణాల వల్ల కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ముందుగా ఖాతా రద్దు చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతిస్తుంది.
- ఖాతాలో నిల్వపై అప్పు తీసుకునే వెసులుబాటు కూడా లేదు.
- అమ్మాయికి 18 ఏళ్లు నిండిన తర్వాత ఖాతాపై పూర్తి హక్కులు తనకే సంక్రమిస్తాయి. ఖాతాలోని సొమ్మును తల్లిదండ్రులకు ఇవ్వరు.
- నివాసం మారితే మారిన కొత్త ప్రదేశానికి ఖాతాను బదిలీ చేసుకోవచ్చు.
- కూతురు పుట్టగానే నెలకు రూ.1,000 చొప్పున 14 సంవత్సరాలు జమ చేసుకుంటూ వెళ్లారనుకుందాం. ప్రస్తుత 9.1శాతం వార్షిక చక్ర వడ్డీ ప్రకారం 21 సంవత్సరాల తర్వాత మీ పాపకు రూ.6,07,128 అందుతాయి. అదే నెలకు రూ.12,500 జమ చేశారనుకుందాం. 21 ఏళ్ల తర్వాత రూ.75,89,103 చేతికి వస్తాయి.

- వంగా రాజేంద్రప్రసాద్

## వడ్డీ ఎక్కువే...

పెట్టుబడికి భద్రత, రాబడికి కచ్చితమైన హామీ, ఆదాయపు పన్ను రాయితీ ఉండటం ఈ పథకానికి కలిసొచ్చే అంశాలు. సెక్షన్ 80సీ ప్రకారం ఆదాయపు పన్ను రాయితీ లభించే ఇతర పొదుపు పథకాల (పీపీఎఫ్ 8.7%, ఐదేళ్ల ఎన్‌ఎస్‌సీ 8.5%, పదేళ్ల ఎన్‌ఎస్‌సీ 8.8%, ఐదేళ్ల పోస్టాఫీసు సేవింగ్ స్కీం 8.5% వార్షిక వడ్డీ)తో పోలిస్తే ఇందులో లభించే వడ్డీ (9.1శాతం) కూడా ఎక్కువే.

- తల్లిదండ్రులు, చట్టబద్ధ సంరక్షకులు మాత్రమే కూతురి పేరుతో ఖాతా తెరవవచ్చు. వ్యవధి తీరకముందు డబ్బును వెనక్కి తీసుకునే వెసులుబాటు లేదు. తల్లిదండ్రులు తమ కూతురి పేరుమీద ప్రారంభించిన ఖాతాలో తాత/బామ్మలు తన మనమరాలి పేరుమీద డబ్బు జమ చేయవచ్చు. ఇతర పథకాల్లోలాగా కాకుండా కచ్చితంగా తన మనవరాలికి 18 ఏళ్లు వచ్చాక చదువు లేదా పెళ్లికి బహుమతిగా ఆ మొత్తాన్ని అందే ఏర్పాటు చేయవచ్చు.

## ఇతర పథకాలతో పోలిస్తే...

**పీపీఎఫ్:** ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) ఖాతాను వయసుతో సంబంధం లేకుండా ఎవరైనా ప్రారంభించవచ్చు. సుకన్యా సమృద్ధి ఖాతా పదేళ్ల లోపు బాలికలకు మాత్రమే పరిమితం.

- పీపీఎఫ్‌తో పోలిస్తే సుకన్యా పథకంలో వడ్డీ ఎక్కువే. పీపీఎఫ్‌లో జమ చేసిన మొత్తాన్ని 15 ఏళ్ల తర్వాత తీసుకోవచ్చు. సుకన్య సమృద్ధి ఖాతా పథకం కాల పరిమితి 21 ఏళ్లు. పీపీఎఫ్ ఖాతాలో నిర్దిష్ట వ్యవధి తర్వాత రుణం, పాక్షికంగా కొంత సొమ్ము వెనక్కి తీసుకునే వీలుంది. ఈ పథకంలో ఆ అవకాశం లేదు.
- పీపీఎఫ్‌లో ఏడాదికి కనీసం రూ.500 జమ చేస్తే చాలు. సుకన్యా ఖాతాలో ఈ మొత్తం రూ.1,000.

**బ్యాంకు ఆర్‌డీ:** సుకన్యా సమృద్ధి యోజన దీర్ఘకాలిక పొదుపు పథకం. రెండు, మూడేళ్లలో అవసరం అయిన పిల్లల చదువు, ఇల్లు, ఆసుపత్రి ఖర్చులు, అత్యవసర నిధి వంటి ప్రయోజనాల కోసం బ్యాంకు రికరింగ్ డిపాజిట్‌ను పరిశీలించడమే మేలు.

**మ్యూచువల్ ఫండ్లు:** మ్యూచువల్ ఫండ్లలో క్రమానుగత పెట్టుబడి విధానంలో దీర్ఘకాలం మదుపు చేసినప్పుడు అధిక రాబడిని అందుకునే వీలుంటుంది. అయితే, పెట్టుబడికీ, రాబడికీ ఎలాంటి హామీ ఉండదని మర్చిపోకూడదు. కాబట్టి, స్టాక్ మార్కెట్‌లోని హెచ్చుతగ్గుల్ని గమనిస్తూ.. కాస్త నష్టభయం భరించగలిగే వారు దీర్ఘకాలిక లక్ష్యంతో మ్యూచువల్ ఫండ్లను పరిశీలించవచ్చు. అయితే, అనుకున్న లక్ష్యం కోసం కాకుండా.. మధ్యలో డబ్బు తీసి ఇతర అవసరాలకు వాడేవారు సుకన్యా సమృద్ధి యోజనను ఎంచుకోవడమే మేలు.


# ఆర్థిక వృద్ధికి... ఆటంకాలివే!

సిరి

**డబ్బు సంపాదించాలి... ఆర్థికంగా అత్యున్నత స్థితికి చేరుకోవాలి.. సంపన్నుల జాబితాలో పేరు సంపాదించాలి.. ఇలాంటి కోరికలు ఎవరికివి ఉండవు చెప్పండి? కోరిక, లక్ష్యం ఉండగానే సరిపోతుందా? మరి అందుకోసం మనం ఏం చేస్తున్నాం? డబ్బు విషయంలో మనకున్న అలవాట్లే మిటి?వాటిని ఎలా అధిగమించాలి? ఇవన్నీ తెలుసుకున్నప్పుడే మనమూ ఆర్థికంగా చెప్పుకోదగ్గ స్థితికి చేరుకుంటాం!**

ప్రతి వ్యక్తికీ కొన్ని అలవాట్లు ఉంటాయి. మిగతా విషయాల మాట ఎలా ఉన్నా.. డబ్బుకు సంబంధించినంత వరకూ చాలా వరకు ఇవి అలవాట్ల కన్నా పొరపాట్లుగానే మిగిలిపోతుంటాయి. డబ్బు సంపాదిస్తున్నాం కదా అనే భావనతో మిగతా సంగతులను పట్టించుకోకుంటే.. భవిష్యత్తులో ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఒక వ్యక్తికి ఒక అలవాటు ఉంటే.. అది చుట్టూ తిరిగి డబ్బుతోనే ముడిపడి ఉంటుంది. అవునా? అందుకే, డబ్బుకు సంబంధించిన మన అలవాట్లు, వాటివల్ల వచ్చే దుష్పరిణామాలు తెలుసుకొంటేనే, తగిన జాగ్రత్తలు తీసుకునేందుకు వీలవుతుంది.

## పోటీ పడితే..




ప్రస్తుతం ఎక్కడ చూసినా పోటీనే. ఉద్యోగం, వ్యాపారాల్లోనే కాదు. వ్యక్తుల అలవాట్లలోనూ పోటీతత్వం నెలకొంది. వారికి ఉన్న వస్తువు నాకు లేదు కదా అనే పోటీ ఇటీవల మరీ ఎక్కువవుతోంది. ఇతరులతో పోల్చుకుంటూ ఖరీదైన దుస్తులు, ఫోను కొంటాం. మనల్ని మనం గొప్పగా ఆవిష్కరించుకోవాలనే ప్రయత్నంలో ఖర్చులు అధికంగా చేసేస్తుంటాం. ఇవన్నీ మనల్ని అప్పటికప్పుడు గొప్ప వ్యక్తులు, ఆర్థికంగా ఉన్నవారు అనే భావనకు గురిచేయవచ్చేమోగానీ.. తర్వాత అప్పుల ఊబిలోకి నెట్టేయడం ఖాయం. కారణం ఏదైనా సరే మీ కోరికలు అప్పులు చేయిస్తుంటే మాత్రం కాస్త జాగ్రత్త పడాల్సిందే. రూ.లక్ష పెట్టి ఒక గృహోపకరణం కొని, దానికి వాయిదాలు కట్టుకుంటూ వెళ్లడం కన్నా.. ఆ వాయిదాలకు చెల్లించే సొమ్మును పెట్టుబడులకు మళ్లించాలనే ఆలోచన చేయడం మంచిది.

**ఏం చేయాలి?:** అప్పు చేసి కోరికలను తీర్చుకోవడం ముమ్మాటికీ తప్పే. అయితే, ఇల్లు కొనాలనే లక్ష్యంతో, పిల్లల ఉన్నత చదువుల కోసం తీసుకునే అప్పులు ఎప్పుడూ మంచివే. ఇలాంటి అంశాల్లో పోటీపడినా ఆర్థికంగా అవి మనల్ని ఉన్నత తీరాలకు చేర్చేవే అని గుర్తించాలి.

## తర్వాత చూద్దాం!





రేపు చేయాల్సిన పని ఈ రోజు..ఈ రోజు చేయాల్సిన పని ఇప్పుడే! కానీ, కొంతమందికి ఈ రోజు పనుల్ని రేపటికి వాయిదా వేయడం అలవాటే. మిగతా అంశాల్లో ఎలా ఉన్నా పెట్టుబడుల విషయంలో వాయిదా అనేది ఏ మాత్రం ఆచరణీయం కాదు. 'వచ్చే నెల నుంచి తప్పని సరిగా పెట్టుబడులను ప్రారంభిస్తాం' అని అనుకునేవారు ఎంతోమంది. అందులో కొంతమందే ఆ మాటను నిలబెట్టుకుంటారు. మిగతావారు మరో నెలకు వాయిదా వేయడమే. పెట్టుబడుల విషయం ఒకటే కాదు.. బీమా పాలసీలు తీసుకోవడం కూడా వాయిదా వేయకూడని అంశాలు. ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేం. ఆరోగ్య బీమా తీసుకోవడంలో ఆలస్యం చేస్తే.. ఎప్పుడు ఏ అనారోగ్యం వస్తుందో చెప్పలేం. అప్పుడు చేతిలో ఉన్న నగదు అయిపోవడంతో పాటు, అప్పులు చేయాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. అయితే, ఈఎస్ఐ, పనిచేస్తున్న సంస్థ అందించే ఆరోగ్య బీమా పాలసీ ఉన్నప్పుడు వ్యక్తిగతంగా పాలసీ తీసుకునేందుకు కాస్త ఆలస్యం అయినా ఫర్వాలేదు.

**ఏం చేయాలి?:** ఆరోగ్య బీమా పాలసీ లేకపోతే ఆలస్యం చేయకుండా తీసుకోవాలి. చిన్న మొత్తంతోనైనా పెట్టుబడిని ప్రారంభించాలి. ఆలస్యం చేస్తున్నకొద్దీ మన లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం అవుతుంది.

## మదుపంటే జూదం అనుకోవడం..

స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టడం అంత తేలికేమీ కాదు. అలాఅని పూర్తిగా కష్టం కూడా కాదు. ఏదైనా విషయాన్ని అర్థం చేసుకోవడంలోనే పొరపాటు చేస్తుంటాం. మార్కెట్‌ను క్షుణ్నంగా అర్థం చేసుకున్న వారికి నేరుగా ఈక్విటీ పెట్టుబడులు నప్పుతాయి. అంతేకానీ, ఫలానా షేరు బాగుంటుంది.. పెట్టుబడి పెట్టండి అని మీ మిత్రుడో, బంధువో చెప్పినదాన్ని నమ్మి మదుపు చేశారనుకుందాం. నష్టం వస్తే భరించాల్సింది మీరే. ఆప్షన్ ట్రేడింగ్ చేయడం వల్ల తొందరగా లాభాలు సంపాదించవచ్చు అని మీ స్నేహితుడు అన్నారనుకోండి. మీరు వెంటనే పెట్టుబడులు పెట్టడం మానేసి, ట్రేడింగ్ వైపు దృష్టి సారిస్తే అప్పుడు ఆలోచించాల్సిన విషయమే. పెట్టుబడి అంటే దీర్ఘకాలిక లక్ష్యం కోసం చేసేది. అంతేకానీ, ఇప్పటికిప్పుడు లాభాలు సంపాదించేందుకు కాదు అని గుర్తుంచాలి.



**ఏం చేయాలి?:** మీ కష్టార్జితాన్ని పెట్టుబడులుగా మార్చే క్రమంలో మీకు అర్థం కాని పథకాల జోలికి వెళ్లవద్దు. నష్టభయం ఎలా ఉంటుందో తెలుసుకోకుండా మదుపు చేయడం అంటే జూదంతో సమానం అని మర్చిపోవద్దు. స్వల్ప కాలంలో అధిక ఆదాయం ఆర్జించాలనే ఆశ ఉండవచ్చు. కానీ దురాశ కాకుండా చూసుకోండి. క్రమశిక్షణతో దీర్ఘకాలం మదుపు చేసినప్పుడు మంచి ఫలితాలు సంపాదించగలం. సంపదా వృద్ధి చెందుతుంది.

## అంతకు మించి!



ఎంత చెట్టుకు అంత గాలి.. పిండి కొద్దీ రొట్టె! ఇవన్నీ ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. మన పరిధిలో మనం ఉండాలని చెప్పడమే ఈ మాటల లక్ష్యం. డబ్బు విషయంలోనూ అంతే. ఆదాయం కన్నా.. ఖర్చులు ఎక్కువగా ఉంటే నెల తిరిగే సరికి చేతిలో చిల్లగవ్వ మిగలకపోగా అప్పులపాలవుతాం. ఇలా నెలనెలా అప్పులే చేసుకుంటూ వెళ్తే ఇక డబ్బు జమ అవ్వడం అనేది కలగానే మిగిలిపోతుంది. ఆదాయం కన్నా.. మీ ఖర్చు అధికంగా ఉందంటే మీకు అతిగా ఖర్చు చేసే అలవాటు ఉందన్నమాట. దీన్ని వీలైనంత తొందరగా వదిలించుకోవాల్సిన అవసరం ఉంది.

**ఏం చేయాలి?:** మీ ఖర్చులపై ఓ కన్నేయండి. ప్రతిదానికీ ఓ పరిమితి విధించుకోండి. అవసరాలు, కోరికలు వేటికవే ప్రత్యేకంగా జాబితా రాసుకోండి. ప్రాధాన్య క్రమాన్ని పెట్టుకోండి. బడ్జెట్ వేసుకొని మీ ఖర్చులను తగ్గించుకునేందుకు ప్రయత్నించండి. ఒకవేళ మీరు అవసరాల మేరకే ఖర్చు చేస్తున్నారనుకుందాం. అయినప్పటికీ మీ దగ్గర ఉన్న డబ్బు సరిపోవడం లేదా? ఇక మీకున్న ప్రత్యామ్నాయం.. ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రయత్నించడమే. ఇందుకోసం ఏం చేయాలన్నది వ్యక్తిగత పరిస్థితులను బట్టి నిర్ణయించుకోవాలి.

## ఖర్చు ముందు....

చాలామంది పొదుపు చేస్తారు. మరికొంతమంది పొదుపు చేయడానికి ప్రయత్నం చేస్తారు. కొంతమంది చేతిలో డబ్బు ఉన్నప్పుడు పొదుపు చేస్తారు. ఖర్చు ముందు.. పొదుపు తర్వాత అని ఆలోచిస్తే.. ఎప్పటికీ పొదుపు చేయడం సాధ్యం కాదు. ఏ పని చేసినా ఒక అలవాటుగా మారాలి. పొదుపు విషయం కూడా అంతే. ముందుగా పొదుపు.. ఆ తర్వాతే ఖర్చు అనే నియమాన్ని పాటిస్తేనే ఇది సాధ్యం

**ఏం చేయాలి?:** ఒక నెలలో మీ ఆదాయ వ్యయాలకు సంబంధించి పూర్తి బడ్జెట్ వేసుకోండి. అప్పుడు మీకు కొంత మిగులు కనిపిస్తుంది. ఆ తర్వాత నెల నుంచీ ముందుగా ఆ మొత్తాన్ని తీసి పక్కన పెట్టండి. మిగిలిన మొత్తాన్నే మీ అవసరాలు తీర్చుకునేందుకు వినియోగించండి. అయితే, ముందుగా మీ ఆరు నెలల ఖర్చులకు సరిపడా మొత్తాన్ని అత్యవసర నిధిగా అందుబాటులో ఉంచుకోవడం మర్చిపోవద్దు.


## ధైర్యం చేయకపోవడం!



కొంతమంది ప్రతి విషయానికీ భయపడుతుంటారు. అది వారికి ఓ అలవాటుగా కూడా మారిపోతుంది. పెట్టుబడులు అంటేనే ఎంతోకొంత నష్టభయం ఉంటుంది. ఏ మాత్రం నష్టం వచ్చినా తట్టుకోలేం అనేది అన్ని సందర్భాల్లోనూ మంచిది కాదనే అనుకోవచ్చు. నష్టభయం లేని పథకాల్లోనూ.. వచ్చే రాబడికి ద్రవ్యోల్బణం అనే నష్టం ఉంటుందని మర్చిపోవద్దు. ఈక్విటీల్లో మదుపు చేసినప్పుడు నష్టపోయే అవకాశం కాస్త అధికంగానే ఉంటుంది. అంతమాత్రాన వాటికి పూర్తిగా దూరంగా ఉండటం మంచిది కాదు. ఎలా తగ్గించుకోవాలో తెలుసుకోవాలి. అందుకు అనుగుణంగా పెట్టుబడి పథకాలను ఎంచుకోవాలి.

**ఏం చేయాలి?:** అధిక నష్టభయం ఉన్న చోట అధిక రాబడికీ అవకాశం ఉంటుంది. అంతమాత్రాన నేరుగా ఈక్విటీలనే ఎంచుకోవాలని కాదు. దీర్ఘకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని, పెట్టుబడి పెట్టాలనుకున్నప్పుడు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లను ఎంచుకోవచ్చు. వీటిలో నష్టభయం కాస్త తక్కువగా ఉంటుంది. మీ ఆర్థిక లక్ష్యాలు ఏమిటన్నది గుర్తించి, అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టాలి. క్రమం తప్పకుండా పెట్టుబడులను సమీక్షించుకుంటూ కొనసాగించాలి.


## వ్యవధి ముగిసే వరకూ...




కొంతమంది నిర్ణీత గడువు ముగిసేవరకూ ఏ పనీ చేయరు. తీరా అప్పుడు హడావుడి పడతారు. క్రెడిట్ కార్డు బిల్లులు, ఫోను బిల్లు, బీమా ప్రీమియంలాంటివన్నీ గడువుకు ముందే చెల్లించాలి. లేకపోతే అనవసర ఇబ్బందులు వస్తాయి. ఉదాహరణకు ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లించడం ఆలస్యం అయ్యిందనుకోండి. బీమా రక్షణకు దూరం కావాల్సిన పరిస్థితి తలెత్తవచ్చు. వాహన బీమా ఒక్క రోజు ఆలస్యం అయినా నో క్లెయిం బోనస్‌ను వదులుకోవాల్సి వస్తుంది. క్రెడిట్ కార్డు బిల్లు గడువు తేదీ దాటితే వడ్డీ భారం మోయాల్సిందే.

**ఏం చేయాలి?:** వీలైనంత వరకూ బిల్లులు అన్నీ మీ ఖాతా నుంచే నేరుగా చెల్లించే ఏర్పాటు చేసుకోండి. దీనివల్ల గడువు తేదీని మీరు మర్చిపోయినా ఇబ్బంది ఉండదు. అయితే ఖాతాలో నిర్ణీత మొత్తంలో నిల్వ ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి.

## వ్యసనాలను వదలకపోతే..



పొగతాగడం.. మద్యం సేవించడం ఆరోగ్యానికి హానికరం. ఇలాంటివాటిల్లో ఇప్పుడు చిరుతిళ్లు, వారంలో ఐదారుసార్లు బయటే భోజనం చేయడం కూడా చేర్చవచ్చు. ఇవన్నీ ఆరోగ్యాన్ని పాడు చేసే అలవాట్లే కాకుండా.. ఆర్థికంగా కూడా వృద్ధి చెందేందుకు అవరోధాలే. అన్ని ఖర్చులు కలిపి నెలకు రూ.3వేలు అవుతుందనుకుందాం. ఈ మొత్తాన్ని కనీసం 15 శాతం రాబడి వచ్చే చోట మదుపు చేస్తే పదేళ్లలో దాదాపు రూ.8,35,972 జమ అవుతాయి.

**ఏం చేయాలి?:** వ్యసనాలను ఒక్కసారి మానేయడం కుదరకపోతే కనీసం ఖర్చు తగ్గించుకునేందుకు ప్రయత్నించాలి. నెలకు రూ.3వేలకు బదులు రూ.1500 ఖర్చు చేశారనుకుందాం. మిగిలిన రూ.1,500లను అయినా పెట్టుబడి కోసం ఉపయోగించుకోవచ్చు. కాలక్రమేణా మొత్తం ఖర్చును తగ్గించేందుకు కృషి చేయాలి. అప్పుడే శారీరక ఆరోగ్యంతో పాటు, ఆర్థికారోగ్యం కూడా మెరుగుపడుతుంది.

Scanned with OKEN Scanner